క్లుప్తంగా

జిల్లా స్థాయి పోటీలకు శరణ్య



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: విద్యార్థులకు ప్రతి అంశంపై అవగాహన అవసరమని ఎంఈఓ-1 సామల సింహాచలం సూచించారు. చిరుధాన్యాలపై మండలస్థాయి ఎగ్జిబిషన్ పోటీని బలిజిపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించగా వంతరాం ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని బి.బిందు శరణ్య ప్రథమస్థానంలో నిలిచింది. ఆ విద్యార్థినిని ఎంఈఓ సామల సింహాచలం అభినందించి బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలస్థాయిలో ఉన్నత పాఠశాలల్లో చిరుధాన్యాలపై విద్యార్థులకు ఎగ్జిబిషన్ పోటీలు ఏర్పాటుచేశామని, ఇక్కడ ప్రథమస్థానంలో నిలిచిన వారిని జిల్లాస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.జయప్రసాద్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల వాడకంపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ-1 జి. సూరిదేముడు

సీతానగరం: పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చిరుధాన్యాలు ఏవిధంగా దోహదపడతాయో బోధన సమయంలో ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని ఏంఈఓ-1,2 జి.సూరిదేముడు, ఎం. వెంకటరమణ కోరారు. ఈ మేరకు మండలంలోని ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు చిరుధాన్యాల వాడకం, వాటివల్ల విద్యార్థులకు ఒనగూరే ఆరోగ్యపరమైన అంశాలపై శుక్రవారం సీతానగరం ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని ఆర్‌వెంకంపేట, నిడగల్లు, బూర్జ, గాదెలవలస, మరిపివలస, సీతానగరం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు మరింత బలోపేతం కావాలి



మాట్లాడుతున్న వెలుగు పీడీ కిరణ్‌కుమార్

మక్కువ: మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని వెలుగు పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా బాగుపడాలని, వ్యాపారవేత్తలుగా రాణించాలని ఆకాంక్షించారు. ప్రతి సభ్యురాలు ఆదాయం పెంచుకోవడానికి సరైన జీవనోపాధి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సన్నిబాబు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన శనివారం జరగనున్నట్టు ఎంపీడీఓ జి.పైడితల్లి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు. మండల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

26న వాహనాల వేలం

సీతంపేట: సారాతో అక్రమంగా రవాణా చేసి పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్టు ఎస్‌ఐ ఎ.నీలకంఠరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పాలకొండ డీఎస్పీ సమక్షంలో ఉదయం 10 గంటలకు ఒక ఆటో, మరో బుల్లెట్, 2 బైకులు వేలం వేయనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు హాజరు కావాలని కోరారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో యూటీఎఫ్ నేతలు

సీతంపేట: యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు రెండవ రోజు సీతంపేటలో ఘనంగా జరిగాయి. స్థానిక దోనుబాయి కూడలి వద్ద యూటీఎఫ్ జెండాను సీనియర్ నాయకులు పి.పద్మశ్రీ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ఉపన్యసించారు. పతాక గేయాలను కె.గౌరునాయుడు బృందం ఆలపించింది. అనంతరం జాతా పాలకొండ, వీరఘట్టం మీదుగా పార్వతీపురం వెళ్లింది. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు, జిల్లా ఆఫీసు బేరర్లు, రాష్ట్ర కౌన్సిలర్లు, మండల నాయకులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు మంజూరు

- లబ్ధిదారులకు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు

పార్వతీపురంటౌన్:

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోంది. దీనిలో భాగంగా ఎప్పటికప్పుడు రేషన్ కార్డులు మంజూరు చేస్తోంది. గతంలో రేషన్‌కార్డు పొందాలంటే ఏళ్ల తరబడి ఎదురు చూడడంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలో ప్రతి ఆరు నెలలకోసారి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తోంది. వలంటీర్ల ద్వారా అర్హులతో దరఖాస్తు చేయించి కార్డులు మంజూరు చేయడంతో పాటు నేరుగా ఇంటికే తీసువచ్చి కొత్త కార్డు అందిస్తోంది. దీనిలో భాగంగా తాజాగా పార్వతీపురం నియోజకవర్గంలోని 3 మండలాలకు మంజూరైన 1,394 రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేశారు. రేషన్ కార్డు మంజూరు నిరంతర ప్రక్రియలా సాగుతోంది. కొత్తగా పెళ్లయిన దంపతులకు, ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి వేరే కాపురం పెట్టినా తక్షణం కొత్త రేషన్‌కార్డు మంజూరు చేస్తున్నారు.



పార్వతీపురం పట్టణంలో రేషన్ కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు (ఫైల్)

నియోజకవర్గంలో జగనన్న సురక్ష ద్వారా మంజూరైన కార్డులు

మండలం	మంజూరైన కార్డులు
బలిజిపేట	361
పార్వతీపురం	692
సీతానగరం	341

ఏళ్ల ఎదురుచూపులకు తెరపడింది



గతంలో రేషన్ కార్డు కావాలంటే ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది. జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే రేషన్ కార్డు అందజేశారు. సత్వరమే కొత్త కార్డు జారీ చేయడం చాలా ఆనందంగా ఉంది.

– జడగ గౌరీశంకరరావు, పార్వతీపురం

రేషన్ పంపిణీ చేస్తాం



నియోజకవర్గానికి నూతనంగా మంజూరైన 1394 బియ్యం కార్డుల పంపిణీ చురుగ్గా సాగుతోంది. కొత్త కార్డులు పొందిన వారికి వచ్చేనెల నుంచి ఉచితంగా బియ్యంతోపాటు తక్కువ ధరకు పంచదార, కందిపప్పు అందిస్తాం. ప్రజలు రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

– శివన్నారాయణ, తహసీల్దార్, పార్వతీపురం

అంబేడ్కర్ భవన నిర్మాణానికి కృషి

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సమక్షంలో సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జునకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సాలూరు: పట్టణంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి కృషి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. శుక్రవారం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ, భవన నిర్మాణానికి సంబంధించి పట్టణానికి చెందిన రిపబ్లికన్ పార్టీ నాయకుడు గొంప ప్రకాశరావు, వైస్సార్‌సీపీ నాయకులు పిరిడి రామకృష్ణ, తదితరులు తనను కలవగా రెవెన్యూ అధికారులతో మాట్లాడి స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకున్నానని తెలిపారు. ఈ క్రమంలో భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రకాశరావు, రామకృష్ణ, తదితరులు శుక్రవారం సీఎంకు వచ్చి తనకు, సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జునలకు వినతిపత్రాలు అందజేశారన్నారు.

జీజీఎంపీ నిధులతో శరవేగంగా అభివృద్ధి పనులు



పనులు పరిశీలిస్తున్న డైరెక్టర్లు కృష్ణంనాయుడు, తిరుపతిరావు

సీతానగరం: గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల అవసరాలను గుర్తించి మంజూరు చేసిన పనులు గ్రామాల్లో శరవేగంగా జరుగుతున్నాయని డీసీసీబీ డైరెక్టర్ ఎ.కృష్ణంనాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు అన్నారు. మండలంలోని అంటిపేట పంచాయతీలో ఎస్సీ వీధిలో నిర్మిస్తున్న డ్రైనేజీల పనులను ఇంజినీరింగ్ సహాయకుడు నవీన్‌తో కలిసి వారు శుక్రవారంపరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ప్రజల విజ్ఞప్తి మేరకు వారి అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇంజినీరింగ్ సహాయకుడు నవీన్ మాట్లాడుతూ అంటిపేట పంచాయతీలో 10 అభివృద్ధి పనుల కోసం రూ. 20 లక్షల నిధులు విడుదల చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు టి.శంకరరావు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

జేఏఎస్‌ను విజయవంతం చేయాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు కోరారు. ఈ మేరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులతో శుక్రవారం తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. జేఏఎస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యుల ద్వారా వైద్యసేవలు అందించాలని నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, డెంటల్ అసోసియేషన్ అధ్యక్షులు యాళ్ల వివేక్, ఆర్‌బీఎస్‌కె ప్రాజెక్టు అధికారి డాక్టర్ దవళ భాస్కర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ నవీన్‌కుమార్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం ఎంతో శ్రేయస్కరం



జనవరివలసలో నిర్వహిస్తున్న పౌష్టికాహార మహోత్సవాలు

సాలూరు: పౌష్టికాహారారం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని కొత్తవలస సర్పంచ్ నెమలిపిట్ట ధర్మావతి అన్నారు. కొత్తవలస పంచాయతీ జనవరివలసలో శుక్రవారం నిర్వహించిన పౌష్టికాహార మహోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. అనంతరం గర్భిణులు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ సత్యవతి, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి సమస్యలు

- వినతులు స్వీకరించిన జిల్లా అధికారులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

మక్కువ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించగా.. ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. తమ ఇంటి మీద నుంచి విద్యుత్ తీగలు వెళ్తున్నాయని, వాటిని తొలగించాలని శంబర గ్రామానికి చెందిన అల్లు వెంకటరమణ.. గ్రామంలో మంచినీటి సమస్య నెలకొందని పుల్లేరువలసకి చెందిన మర్రి దాలమ్మ.. స్కూల్ నిర్మాణం వేగవంతం చేయాలని ఓ. పెద్దవలసకి చెందిన యువకులు.. భూమికి పాస్‌పుస్తకం మంజూరు చేయాలని మార్కొండపుట్టి గ్రామానికి చెందిన అల్లు గౌరునాయుడు.. డప్పు కళాకారుల పింఛన్ మంజూరు చేయాలని దబ్బగెడ్డ గ్రామానికి చెందిన కుప్పా గురువులు.. మక్కువ, ఖైరిసాగరం చెరువు చుట్టూ ఆక్రమణలు తొలగించాలని మావుడి. ప్రసాదరావు.. తదితరలు వినతులు అందజేశారు. మొత్తం 97 అర్జీలు అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో జేసీ గోవిందరావు, ఆర్డీఓ హేమలత, జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల సంతృప్తి



అప్పయ్యపేటలో రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ శిరీష

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పీహెచ్‌సీ డాక్టర్ శిరీష అన్నారు. ఈ మేరకు మండలంలోని అప్పయ్యపేటలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన సమయానికే గ్రామాల్లో సిబ్బంది వైద్య సేవలందిస్తున్నామని, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి వారిళ్లలోనే వైద్యసిబ్బంది సేవలు అందజేస్తారన్నారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే ఆరోగ్య పరీక్షలు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై అవగాహన కల్పించుకుని రోగులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బి.సూర్యనారాయణ, వైద్యసిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

చేదోడు దరఖాస్తుల పరిశీలన



పలగరలో దరఖాస్తులు పరిశీలిస్తున్న కార్పొరేషన్ ఏఓ గోపి

బలిజిపేట: జగనన్న చేదోడు పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి యూనిట్లు ఉన్నాయా? లేదా? అనే దానిపై అధికారులు పర్యవేక్షణ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 70 శాతానికి మించి దరఖాస్తులు వచ్చిన సచివాలయాల్లో పరిశీలిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఏఓ గోపి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిజిపేట మండలంలో ఆజ్జాడ, నారాయణపురం, బలిజిపేట, పలగర, గంగాడ, గలావల్లి సచివాలయాల్లో 532దరఖాస్తులు వచ్చాయని, ఈ మేరకు ఆయా సచివాలయాల పరిధిలో యూనిట్లు ఉన్నవీ? లేనిదీ? పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. పర్యవేక్షణ అనంతరం వివరాలను ఉన్నతాధికారులకు తెలియచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణ బృందం, బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయం ఏఓ భానుమూర్తి, విక్టర్, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా గణేశుని నిమజ్జనం



ఇప్పలవలసలో గణపతికి నైవేద్యం సమర్పించిన ఉత్సవ కమిటీ సభ్యురాలు సంతోషికుమారి



బలిజిపేట: గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవం

సీతానగరం: మండలంలో వాడవాడలా జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా భక్తులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, యువత ఆధ్వర్యంలో వినాయక విగ్రహాల నిమజ్జనాలు, అన్నసంతర్పణ కార్యక్రమాలు వేడుకగా జరుగుతున్నాయి. ఈ మేరకు బుధవారం అంటిపేట, సీతానగరం, వెన్నెలబుచ్చింపేట, అప్పయ్యపేట, బుడ్డిపేట, ఇప్పలవలస,అంటిపేట వెంకటాపురం గ్రామాల్లో వినాయక మంటపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించి అనంతరం వైభవోపేతంగా మేళతాళాలతో ఊరేగిస్తూ నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. ఇప్పలవలసలో వెంకటాపురం ఎంపీటీసీ జి. సంతోషి, బ్యాంక్ ఉద్యోగి ఏగిరెడ్డి పవన్ కుమార్, శంకరరావు, లక్ష్మణరావులు విఘ్నేశ్వరునికి పూజలు చేసి అన్నసంతర్పణ ప్రారంభించారు.

వెంగళరాయపురంలో నిమజ్జనం

బలిజిపేట: వినాయక చవితి ఉత్సవాలను మండలంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. పలు గ్రామాల్లో ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. మరికొన్ని గ్రామాల్లో ఏడు రోజులు, ఇంకొన్ని గ్రామాల్లో నవరాత్రులు ఉంచి నిమజ్జనాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా మండలంలోని వెంగళరాయపురంలో స్వామివారి నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా గ్రామస్తులు మంటపం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటే దోమలు మాయం

- డీఐఓ డాక్టర్ టి.జగన్మోహనరావు



ఖాళీ కుండీల్లో దోమలను పరిశీలిస్తున్న డీఐఓ జగన్మోహనరావు

సీతానగరం: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే దోమలవ్యాప్తిని నివారించవచ్చని డీఐఓ డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు బుధవారం కె.సీతారాంపురంలో వైద్యసిబ్బంది, పంచాయతీ పాలకులు నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు ప్రజలందరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరునిల్వ ఉండడానికి ఆస్కారం ఉన్న పాడైన వస్తువులు, కొబ్బరి బొండాలు, ఉపయోగంలో లేని రుబ్బురోళ్లు, ప్లాస్టిక్ వస్తువులు, కుండీలు, తీసేసిన టైర్లను సిబ్బందితో కలిసి పరిశీలించి, నివారణ చర్యలు చేపట్టారు. గ్రామంలో జ్వరాలు ఏమైనాఉన్నాయా? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇంటి పరిసరాల్లో నీరు ఎక్కువకాలం నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని తద్వారా మలేరియా, డెంగీ, తీవ్రమైన జ్వరాలు ప్రబలుతాయని వాటి నివారణ దిశగా వైద్యసిబ్బంది ఇతర శాఖల సమన్వయంతో ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది శాంతమ్మ, దివ్య, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి పంచరాత్రి ఉత్సవాలు



లక్షపత్రి పూజ చేస్తున్న భక్తులు

పార్వతీపురంటౌన్: గణపతి పంచరాత్ర ఉత్సవాలను స్థానిక పాత బస్టాండ్ దగ్గర గల హోటల్ శ్రీకాంత్ వెనుక ఎస్ఎస్ఎం నగర్ శ్రీ షిర్డీసాయి ధ్యాన మందిరంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం లక్ష బిల్వపత్ర పూజను 55మందితో నిర్వహించారు. కాలనీ గౌరవ అధ్యక్షుడు జల్లు వెంకటేశ్వరరావు, జల్లువినయ్, మధులిక దంపతులు పూజలో పాల్గొని ముత్తైదువులకు పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం సుమారు 200 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ధ్యానమందిరం ప్రాంగణంలో జానకి రమణ భజన మండలి వారు కోలాటం ప్రదర్శించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక పూజలు

పార్వతీపురం మండలంలోని సంగంవలస, ఎమ్మార్‌నగరం, ఎన్.ములగ, చినబొండపల్లి, బాలగుడబ తదితర గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు లక్ష పత్రిపూజ, కుంకుమపూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.



సంగంవలసలోని కూరాకుల వీధిలో పూజలు చేస్తున్న భక్తులు

ఇంటి వద్దే వైద్య పరీక్షలు



పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు



వెంకట బైరిపురంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

మక్కువ: జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్దనే ఏడు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బగాది జగన్నాథరావు అన్నారు. మండలంలోని వెంకట భైరిపురంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే, ఫ్రై డే డ్రై డే కార్యక్రమాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల పట్ల ప్రజలకు విస్తత అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటికీ ఆరోగ్య సర్వేలో భాగంగా గ్రామ, వార్డు సచివాయంలో ఏఎన్ఎం, ఆశాలు ఒక బృందంగా.. సీహెచ్ఓలు, ఆశా కార్యకర్తలు మరొక బృందంగా ఏర్పడి సర్వే చేపట్టాలని సూచించారు. బీపీ, మధుమేహం, రక్తహీనత, మూత్రం, మలేరియా, డెంగీ, కఫం పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను తనిఖీ చేసి పేర్ల జాబితా తయారు చేయాలని ఆయన సూచించారు. ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న వైద్య శిబిరాలకు అవసరమైన ఓపీ చీటీలను అందరికీ అందజేయాలని ఆయన ఆదేశించారు.

ఫ్రై డే డ్రై డే పాటించాలి

ప్రతి శుక్రవారం ఇంటిలో ఉన్న నీటి పాత్రలను ఖాళీ చేసి శుభ్రపరచాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి గ్రామస్తులకు పిలుపునిచ్చారు. గ్రామంలో పరిశుభ్రత పాటించాలని తద్వారా దోమలు వద్ది వ్యాప్తి చెందకుండా ఉంటాయన్నారు. ఇళ్ల సమీపంలో కొబ్బరి బొండాలు, టైర్లు ఉంచడం వాటిలో నీరు చేరి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.